# ప్రభాత ఉదయం

తెలుగు దినపత్రిక

సంపుటి: 2 | సంచిక: 209 | పేజీలు: 4 | వెల: రూ.3/- | బుధవారం 6 అక్టోబర్ 2024 | ఎడిటర్: కోట్ల చంద్రకాంత్




## 25 నుంచి పార్లమెంట్ సమావేశాలు

### కేంద్రమంత్రి కిరణ్ రిజిజు వెల్లడి

న్యూఢిల్లీ, నవంబర్ 5 (ప్రభాత ఉదయం): పార్లమెంట్ శీతాకాల సమావేశాలు నవంబర్ 25 నుంచి ప్రారంభం కానున్నాయి. డిసెంబర్ 20 వరకు కొనసాగనున్నాయి. ఈ మేరకు పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మంగళవారం వివరాలు వెల్లడించారు. ఈ సెషన్‌లో భాగంగా నవంబర్ 26న రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహిస్తామని మంత్రి తెలిపారు. సంవిధాన్ సదన్ (పార్లమెంట్ పాత భవనం) సెంట్రల్ హాల్ ఇందుకు వేదిక ..మిగతా 2లో

# కులగణన ద్వారా అన్ని కులాలకు న్యాయం



**నష్టపోతున్న కులాలకు ప్రాతినిధ్యం దక్కుతుంది**

**కులగణన అవసరాన్ని పార్లమెంట్‌లోనే ప్రస్తావించా**

**కులగణనపేరు చెప్పగానే దేశ విభజనపేరుతో విమర్శలు**

**కులగణన పేరు చెబితేనే ప్రధాని మోడీ విమర్శలు**

**దేశానికి ఆదర్శంగా నిలవబోతున్న తెలంగాణ కులగణన**

**హైదరాబాద్ సదస్సులో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ వ్యాఖ్యలు**

హైదరాబాద్, నవంబర్ 5 (ప్రభాత ఉదయం): కులగణన ద్వారా అన్ని కులాలకు న్యాయం జరుగుతుందని కాంగ్రెస్ అగ్రనేత, పార్లమెంటులో విపక్షనేత రాహుల్ అన్నారు. కులాల వారీగా జనాభా లెక్కిస్తే తరాలుగా నష్టపోతున్న వారికి తగిన ప్రాతినిధ్యం దొరుకుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కులగణన గురించి ప్రస్తావించగానే దేశాన్ని విభజించేస్తున్నామని ప్రధాని మోడీ చేసిన వ్యాఖ్యలను తిప్పి కొట్టారు. తెలంగాణలో కులగణన దేశానికి ఆదర్శంగా నిలవబోతున్నదని రాహుల్ గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. హైదరాబాద్ బోయిన్‌పల్లిలోని గాంధీ ఐడియాలజీ కేంద్రంలో కులగణనకు సంబంధించి పౌరహక్కులు, మేధావులతో నిర్వహించిన సభలో రాహుల్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సహా పలువురు మంత్రులు, మేధావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. దేశసంపద సమానంగా పంచాలంటే..దేశం మొత్తం కులగణన సర్వే చాలా కీలకం అన్నారు. కులగణన సర్వే ఎందుకు కీలకమో వివరించారు. దేశంలో కుల వివక్ష కొనసాగుతుందని.. కులం విషయంలో ఓ విజన్ తో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని మతాలపై మన విజన్ తో వెళ్లడం తప్పనిసరి అన్నారు. దేశాన్ని విభజించే కుట్ర చేస్తున్నానని ప్రధాని మోదీ అంటున్నారు.. దేశం గురించి నిజం చెబితే దేశాన్ని విభజించడం అవుతుందా అని రాహుల్ గాంధీ ప్రశ్నించారు. కుల గణన సర్వే ద్వారా కులాల లెక్క తెల్చవచ్చు.. దేశవ్యాప్తంగా కులగణనపై పార్లమెంట్ చర్చపెట్టింది తానేనని రాహుల్ గాంధీ అన్నారు. భారతదేశంలో కులవ్యవస్థ చాల బలంగా ..మిగతా 2లో



## రాహుల్ మాట ప్రకారం కులగణన

**సామాజిక న్యాయం రాహుల్ ఆశయం**

**కులగణన సదస్సులో సిఎం రేవంత్ వ్యాఖ్య**

హైదరాబాద్, నవంబర్ 5 (ప్రభాత ఉదయం): భారత్ జోడో యాత్ర ఎంతో మందిని కదిలించిందని కులగణన సంప్రదింపుల సమావేశంలో రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం కులగణన చేస్తున్నామని అన్నారు. ఇందిరా గాంధీ 'గరీబ్ హఠావో' అనే నినాదంతో చరిత్రలో నిలిచారని సీఎం గుర్తుచేశారు. ఇప్పుడు రాహుల్ సామాజిక న్యాయం పేరుతో ఇచ్చిన పిలుపుతో ముందుకు కదులుతున్నామని అన్నారు. ప్రస్తుతం తెలంగాణలో కులగణన చారిత్రకం కాబోతోందని, రాహుల్ గాంధీ నేతలకు మాట ఇస్తే అది శాసనమని రేవంత్ ..మిగతా 2లో

## దాశరథిని స్మరించుకున్న కేసీఆర్



హైదరాబాద్, నవంబర్ 5 (ప్రభాత ఉదయం): నా తెలంగాణ కోటి రతనాల వీణ అని నినదించిన తెలంగాణ కవి రచయిత దాశరథి కృష్ణమాచార్య వర్ధంతి సందర్భంగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వారి సేవలను స్మరించుకున్నారు. తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు కోసం సాగిన ఉద్యమంలో దాశరథి అందించిన పోరాట స్ఫూర్తి ఇమిడివుందన్నారు. దాశరథి కృషిని గుర్తించిన నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం వారి స్ఫూర్తిని భవిష్యత్ తరాలకు అందించటానికి పలు కార్యక్రమాలు చేపట్టిందని కేసీఆర్ గుర్తుచేశారు.



## వరంగల్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

**విజన్ 2025 పేరుతో మాస్టర్ ప్లాన్ రూపకల్పన**

**మంత్రిపొంగులేటి కీలక ప్రకటన**

హైదరాబాద్, నవంబర్ 5 (ప్రభాత ఉదయం): మౌలిక వసతుల అభివృద్ధితో పాటు, ఆధునిక టెక్నాలజీని కూడా జోడించి వరంగల్ నగరాన్ని మరింత సమర్ధవంతంగా తీర్చిదిద్దనున్నట్టు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వివరించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వరంగల్ నగర అభివృద్ధి కోసం కీలక ప్రకటన చేశారు. విజన్-2025 పేరుతో మాస్టర్ ప్లాన్‌ను సిద్ధం చేసుకున్నామని ఆయన తెలిపారు. ఈ ప్రణాళికలో భాగంగా, వరంగల్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం పనులు యుద్ధ ప్రాతిపదికన త్వరలో ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ఇటీవల ..మిగతా 2లో

## ప్రైవేటు ఆస్తులపై సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు



న్యూఢిల్లీ, నవంబర్ 5 (ప్రభాత ఉదయం): ప్రైవేటు ఆస్తులపై ప్రభుత్వ హక్కుల పరిధి ఎంతవరకు అనే అంశంపై సుప్రీంకోర్ట్ చారిత్రాత్మకమైన తీర్పు ఇచ్చింది. అన్నీ ప్రైవేటు ఆస్తులపై రాష్ట్ర ప్రభుత్వాలకు హక్కులు ఉండబోవని అత్యున్నత న్యాయస్థానం తేల్చిచెప్పింది. ఉమ్మడి ప్రయోజనాల కోసం పంపిణీ చేసేందుకుగానూ అన్ని ప్రైవేట్ ఆస్తులను స్వాధీనం చేసుకోజాలవని స్పష్టం చేసింది. ఈ మేరకు రాజ్యాంగ ప్రకారం రాష్ట్ర ప్రభుత్వాలకు హక్కులు లేవని స్పష్టం చేసింది. ఈ మేరకు 9 మంది జడ్జిలతో కూడిన ధర్మాసనం 8:1 మెజారిటీతో ఈ తీర్పు ఇచ్చింది. ఈ కీలక తీర్పుని సీజేఐ డీవై చంద్రచూడ్ ప్రకటించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 39(బీ) ప్రకారం ప్రైవేట్ యాజమాన్యంలోని అన్ని వనరులను రాష్ట్రం స్వాధీనం ..మిగతా 2లో

## ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి

**కాంగ్రెస్ ప్రభుత్వంతో అన్ని వర్గాల్లోనూ ఆందోళన**

**ఆటో డ్రైవర్ల మహాధర్నాలో కేటీఆర్ విమర్శలు**



హైదరాబాద్, నవంబర్ 5 (ప్రభాత ఉదయం): మార్పు, మార్పు అనుకుంటూ అందరి కొంపలు పుచ్చుకున్నారు... ఈ కాంగ్రెసోళ్లు అని రేవంత్ రెడ్డి సర్కార్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ధ్వజమెత్తారు. ఆటో డ్రైవర్లు కూడా ఆత్మహత్య చేసుకునే దుస్థితి వచ్చిందని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితిని తీసుకొచ్చింది. దాదాపు ఆరున్నర లక్షల మంది ఆటోడ్రైవర్ల పరిస్థితి చాలా దయనీయంగా ఉందని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇందిరా పార్క్ వద్ద ఆటో డ్రైవర్ల మహాధర్నాలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. ఆటోడ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వస్తుందని ఎన్నడూ అనుకోలే దన్నారు. గత పదేళ్లలో కేసీఆర్ హయాంలో అభివృద్ధి ఫలాలు అనుభవించామని రోజుకు దాదాపు రూ. 2 వేలు సంపాదించే పరిస్థితి ఉండేదని ఆటో డ్రైవర్లు చెప్పారు. ఇప్పుడు రూ. 200 నుంచి రూ. 300 కూడా సంపాదించలేని పరిస్థితి వచ్చిందని ఆటోడ్రైవర్లు ఆవేదన చెందుతున్నారు. గతేడాది ..మిగతా 2లో

## కుటుంబ సర్వే నుంచి టీచర్లను మినహాయించండి

**విద్యా హక్కు చట్టానికి వ్యతిరేకంగా ప్రభుత్వ నిర్ణయం**

**సిఎం రేవంత్‌కు ఎమ్మెల్యే హరీష్ రావు లేఖ**



హైదరాబాద్, నవంబర్ 5 (ప్రభాత ఉదయం): కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టబోయే సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నుండి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను మినహాయించాలని బిఆర్ఎస్ డిమాండ్ చేసింది. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డికి ఎమ్మెల్యే హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు.రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కోసం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సేవలను వినియోగించాలని ప్రభుత్వం నిర్ణయించడం విద్యాహక్కు చట్టం ఉల్లంఘన కిందకు వస్తుందని అన్నారు. 36,559 ఎస్జీటీలను, 3414 మంది ప్రధానోపాధ్యాయులను ఈ సర్వేలో భాగం ..మిగతా 2లో

# కులగణన ద్వారా అన్ని కులాలకు న్యాయం

**మొదటి పేజీ తరువాయి...**

ఉందని అన్నారు. ఇది కాదనలేని వాస్తవమని అన్నారు. అగ్రకులాలకు ఎప్పుడూ కుల వ్యవస్థ అనేది కనిపించదని చెప్పారు. కులగణన ద్వారా ఏళ్లుగా నష్టపోతున్న వారికి న్యాయం జరుగుతుందని అన్నారు. కుల వ్యవస్థ అన్ని రంగాల్లో ఉందని.. రాజకీయ, న్యాయ వ్యవస్థలోనూ అది బలంగా పాతుకుపోయిందని చెప్పుకొచ్చారు. కుల వ్యవస్థ అనేది కొంత మంది ఆత్మ విశ్వాసం దెబ్బతీస్తోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. దీని వల్ల యువత సైతం ముందుకు వెళ్లలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయని రాహుల్ గాంధీ చెప్పారు. తెలంగాణలో జరిగే కులగణన దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని రాహుల్ గాంధీ అన్నారు. కులగణనలో ఏ ప్రశ్నలు అడగాలనేది అధికారులు నిర్ణయించకూడదని, సామాన్యులే నిర్ణయించాలని చెప్పారు. కులవివక్ష, కులవ్యవస్థ ఉన్నప్పుడు అసమానతలు కూడా ఎక్కువగా ఉంటాయన్నారు. దేశంలో కుల వ్యవస్థ, కుల వివక్ష ఉందని అంగీకరిద్దాం. నేను దేశాన్ని విభజించే ప్రయత్నం చేస్తున్నానని ఆరోపణలు చేస్తున్నారు. దేశం గురించి నిజం చెబితే దేశాన్ని విభజించడమా? కులగణన ద్వారా దళితులు, ఓబీసీలు, మహిళల సంఖ్యపై స్పష్టత వస్తుంది. కులగణన తర్వాత ఎవరి దగ్గర ఎంత ఆర్థిక వనరులున్నాయో తెలుసుకుందాం. కులగణన చేస్తామని పార్లమెంట్‌లో స్పష్టంగా చెప్పాను. రిజర్వేషన్ల పరిమితిని తీసేస్తాం అని రాహుల్ గాంధీ అన్నారు. బుధవారం నుంచి కులగణన ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ప్రాథమిక పాఠశాలలకు సర్కార్ ఒంటిపూట బడులను ప్రకటించింది. దేశవ్యాప్తగా ఇప్పటికీ అన్ని రంగాల్లో కుల వివక్ష ఉందన్నారు. అందరికీ సమాన అవకాశాలు కల్పించడానికి కులగణన అవసరం అన్నారు. ఏ వ్యవస్థలో ఎంత మంది ఓబీసీలు ఉన్నారో తెలియాల్సిఉందన్నారు. కులగణనతో అభివృద్ధి , రాజకీయ స్థితిగతులు మారుతాయని రాహుల్ గాంధీ స్పష్టంచేశారు. తాను దేశవ్యాప్తంగా పర్యటించినప్పుడు దాదాపుగా అన్ని రాష్ట్రాల్లో కుల వివక్ష ఉందని తాను గుర్తించానని అన్నారు. అగ్రకులాలకు ఎప్పుడూ కుల వ్యవస్థ



కనిపించదన్నారు. కుల వివక్ష కారణంగా ఇతర కులాల వారు అవకాశాలు కోల్పోతున్నారని చెప్పుకొచ్చారు. తాము అధికారంలోకి రాగానే యాభై శాతం రిజర్వేషన్లను ఎత్తివేస్తామని కులగణన ద్వారా సమానంగా అందరికీ అవకాశాలు కల్పించాల్సి ఉందన్నారు. ఈ విషయంలో తాను అందరికీ అవకాశం కల్పిస్తానన్నారు. దేశంలోని అన్ని వ్యవస్థల్లో కుల వివక్ష ఉందన్నారు. రాజకీయ న్యాయవ్యవస్థల్లో ఉందని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. దేశంలోని పారిశ్రామికవేత్తల్లో ఎస్సీ, ఎస్టీ, గిరిజన కమ్యూనిటీలకు ప్రాతినిధ్యం తక్కువగా ఉందని ప్రతిభ ఉన్నప్పటికీ వారికి పాలనా వ్యవస్థలో భాగస్వాములయ్యే అవకాశం రావడం లేదన్నారు. అందువల్లే తాము కులగణన చేపట్టామని చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాలు చేపడుతున్న కులగణన అంటే అది కేవలం కులాల లెక్కలు కాదు. ప్రభుత్వ విధానాల రూపకల్పనకు పునాది అని రాహుల్ గాంధీ స్పష్టంచేశారు. మేము దేశాన్ని చీల్చాలని ప్రయత్నం చేస్తున్నాం అంటున్నారని...దేశంలో సంపదను ఎవరి వాటా వారికి ఇవ్వడం దేశాన్ని చీల్చడమా అని రాహుల్ ప్రశ్నించారు. ప్రజల ఆలోచనలకు అనుగుణంగా ప్రశ్నలు తయారు చేయాలని రాహుల్ సూచించారు. కులగణన చేసినంత మాత్రాన సరిపోదు. వివిధ కులాల మధ్య సంపద పంపిణీ ఎలా ఉందో అధ్యయనం చేయాలి. అదేవిధంగా బ్యూరోక్రసీ, జ్యుడిషియరీ, మీడియాలో ఓబీసీలు, దళితులు, కార్మికుల భాగస్వామ్యం ఎంతుందో కూడా తెలుసుకోవాల్సి ఉందన్నారు. అందుకే కులగణన చేపట్టామన్నారు. కులగణన విషయంలో తెలంగాణ ప్రభుత్వం దేశానికి ఆదర్సంగా ఉంటుందని ఈ విషయంలో తాను తెలంగాణ నాయకత్వాన్ని అభినందిస్తున్నానని తెలిపారు. రాహుల్ గాందీ కార్యక్రమానికి ప్రముఖులైన ఆహ్వానితుల్ని మాత్రం సమావేశంలోకి ఆహ్వానించారు. ఈ సమగ్ర కుటుంబ సర్వే ఎవరు చేస్తారు, ఎలా చేస్తారు అనే దానిపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. స్కూలు టైమింగ్స్ పూర్తయ్యాక ఉపాధ్యాయులు రోజుకు 5 నుంచి 7 ఇళ్లల్లో సమగ్ర సర్వే చేయనున్నారు.



## రాహుల్ మాట ప్రకారం కులగణన

**మొదటి పేజీ తరువాయి...**

చెప్పారు. రాహుల్ గాంధీ ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణలో కులగణనపై ముందుకెళ్తున్నామని, కులగణన చేసి తెలంగాణ దేశంలో ఆదర్శంగా రాష్ట్రంగా నిలవబోతోందని సీఎం రేవంత్ రెడ్డి తన ప్రసంగంలో చెప్పారు. సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్య, ఉద్యోగ, ఉపాధి కుల గణన సర్వే ప్రభుత్వం బాధ్యతగా భావించిందన్నారు. పౌరసమాజం నుంచి సూచనలు తీసుకోవడానికి రాహుల్ గాంధీ ఇక్కడకు రావడం గొప్ప విషయమని, ఈ నిర్ణయం తీసుకోవాలంటే గుండె ధైర్యం కావాలన్నారు. సామాజిక బాధ్యత, సమాన అవకాశాలు ఇవ్వాలన్న ఆలోచనతో రాహుల్ గాంధీ ఇక్కడకు వచ్చారని, మాటలు కాదు చేతలతో చూపాలన్నది రాహుల్ గాంధీ ఆలోచన అని ఆయన వ్యాఖ్యానించారు. విద్య, వైద్యం, ఉద్యోగం, సామాజిక న్యాయం ప్రజలకు అందించాలని రాహుల్ గాంధీ అడుగు ముందుకు వేశారని, రాహుల్ గాంధీ ఇచ్చిన మాటను నెరవేర్చడమే మన కర్తవ్యమన్నారు. ఇటీవల నిర్వహించిన గ్రూప్ 1 పరీక్షలో 31,383 మంది మెయిన్స్ కు ఎంపికయ్యారని, ఇందులో ఓసీలు-3076 (9.8శాతం), ఈడబ్ల్యూఎస్- 2774 (8.8శాతం), ఓబీసీలు-17,921(57.11శాతం), ఎస్సీలు-4828 (15.3శాతం), ఎస్టీలు-2783 (8.8శాతం) అని ఆయన తెలిపారు. ఇది మా చిత్తశుద్ధికి నిదర్శనమని ఆయన తెలిపారు. మనది రైజింగ్ తెలంగాణ అని ఆయన వ్యాఖ్యానించారు. దేశానికి రాహుల్ గాంధీ ఇచ్చిన మాటను అమలు చేయడం మన కర్తవ్యమన్నారు. కులగణన పూర్తి చేసి బీసీలకు న్యాయంగా అందాల్సిన రిజర్వేషన్లు అందిస్తామని సీఎం రేవంత్ రెడ్డి ఉద్ఘాటించారు. కులగణనను 2025 జనగణనలో పరిగణనలోకి తీసుకోవాలని ఈ వేదికపై తీర్మానం చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. కాంగ్రెస్ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీ మంగళవారం సాయంత్రం హైదరాబాద్‌కు రాగా ఆయనకు సిఎం రేవంత్ తదితరులు ఘనంగా స్వాగతంపలికారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 6 నుంచి తెలంగాణలో ప్రారంభించనున్న కుల గణనపై ప్రజలు, మేధావులు, వివిధ సామాజిక వర్గాల వారి సలహాలు, సూచనలు స్వీకరించేందుకు ఆయన ఇక్కడకు వచ్చారు. బోయిన్ పల్లి గాంధీ ఐడియాలజీ సెంటర్ లో ఈ సదస్సు జరిగింది.



## ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి

**మొదటి పేజీ తరువాయి...**

రాహుల్ గాంధీ వచ్చి ఆటో ఎక్కి ఆటో డ్రైవర్ల సమస్యలు తీరుస్తానని రంగుల కల చూపించారు. నెలకు వెయ్యి రూపాయలు ఇస్తామన్నారు. ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. మనం మంచి కార్యక్రమాలకు వ్యతిరేకం కాదు. మహాలక్ష్మి పేరుతో మహిళలకు రూ. 2500 ఇస్తా అన్నారు. వాటిని ఇవ్వాలని కోరుతున్నాం. కానీ గత 11 నెలల్లో వీళ్లు చెప్పిన దానికి చేసిన దానికి ఎంత తేడా ఉందో?ఏం మార్పు వచ్చిందో ఒక్కసారి ఆలోచించాలని ఆటో అన్నలను కోరుతున్నాని కేటీఆర్ పేర్కొన్నారు. రైతులు, నేత కార్మికులు, ఆటో డ్రైవర్ల ఆత్మహత్యలు ఈ ప్రభుత్వం వచ్చాక ప్రారంభ మయ్యాయి.ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి వస్తుందని ఎప్పుడూ అనుకోలేదన్నారు. శాసన సభలో ఆత్మహత్యలు చేసుకున్న వారి పేర్లతో సహా మేము చెప్పాం. వాళ్ల కుటుంబాలను కూడా ఆదుకోలేదు. ఉచిత బస్సు ప్రయాణానికి మేము వ్యతిరేకం కాదు. కానీ మీరు ఆటో డ్రైవర్లకు ఇస్తా అన్న నెలకు వెయ్యితో పాటు రూ. 5 వేలు నెలకు ఇవ్వాలని కోరుతున్నా. ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డును వచ్చే శాసనసభ సమావేశాల్లో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించాలి. థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్‌ను ఆటో డ్రైవర్లు కావాలని కోరుతున్నారు. ప్రభుత్వం ఈ డిమాండ్‌ను నేరవేర్చాలి. మా ప్రభుత్వం తెచ్చిన ఇన్సూరెన్స్‌ను తీసివేసే ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. అది సరికాదు. కేంద్ర ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు ఇబ్బంది పెట్టేలా చట్టం చేసింది. అది కూడా రద్దు చేయాలి. గతంలో కాంగ్రెస్ పార్టీ మీకు చాలా హామీలు ఇచ్చి?మీ నోట్లో మట్టి కొట్టింది. రాహుల్ గాంధీ చెప్పిన తియ్యని, కమ్మని మాటలు గుర్తు చేసుకోవాల్సిన అవసరముంది అని కేటీఆర్ పేర్కొన్నారు. ఆటో డ్రైవర్లు ఇక్కడకు ఎక్కువ మంది రాకుండా పోలీసులు ప్రయత్నం చేశారు. దయచేసి పోలీసులు అలా చేయవద్దు. ఎందుకంటే మిమ్మల్ని మీతోనే కొట్టించే పరిస్థితి తీసుకువచ్చారు. పోలీసులు డ్యూటీలు చేయండి. కానీ పేద వాళ్ల పట్ల దయతో ఉండండి. సెక్యూరిటీ లేకుండా బయటకు వెళితే రేవంత్ రెడ్డిని తన్నే పరిస్థితి ఉంది. అందుకే ఆయనకు భయం పట్టుకుంది. నల్గొండలో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఉన్న కాంగ్రెస్ పార్టీ సభలో కాంగ్రెస్ నాయకుడే మనం బయటకు వెళితే తన్నే పరిస్థితి ఉందని చెప్పాడు. మనం ఇచ్చిన హామీలు ఒక్కటి నెరవేర్చలేదని చెప్పాడు. రేవంత్ రెడ్డికి పోలీసుల మీద కూడా నమ్మకం లేక సెక్యూరిటీలో నుంచి బెటాలియన్ పోలీసులను తీసేశారు. నిరుద్యోగులు, రైతులు, వృద్ధులు, మహిళలు అందరినీ కాంగ్రెస్ మోసం చేసిందని కేటీఆర్ మండిపడ్డారు. ఎన్ని కేసులు పెట్టినా, జైల్లో పెట్టినా సరే ప్రధాన ప్రతిపక్షంగా ప్రజల కోసం పోరాడతాం. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు చేయాలని మనం కోరుతున్నాం. కార్మికుల హక్కులు, సమస్యల పరిష్కారం కోసం అందరూ కలిసి పోరాటం చేయాల్సిన అవసరముంది. మీ తరఫున శాసనసభలోనూ మేము పోరాటం చేస్తాం. మీడియా కూడా భయపడకుండా పోరాటం చేసే వాళ్ల సమస్యలకు మద్దతుగా నిలవాలని కోరుతున్నానని కేటీఆర్ తెలిపారు.



## వరంగల్ అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం

**మొదటి పేజీ తరువాయి...**

వరంగల్ పర్యటనలో ఉన్న మంత్రి, నగర అభివృద్ధిపై చాలా కీలక నిర్ణయాలు తీసుకుంటామని ప్రకటించారు. వరంగల్‌ను తెలంగాణ రెండవ రాజధానిగా అభివృద్ధి చేయాలని మా లక్ష్యం. మన నగరాన్ని అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటాం, అని మంత్రి చెప్పారు. మంత్రి ఇచ్చిన హామీ ప్రకారం, నగర అభివృద్ధికి సంబంధించిన పనులు త్వరలో ప్రారంభమవుతాయని, మొదటి ప్రాధాన్యతగా విమానాశ్రయ నిర్మాణానికి శ్రీకారం చుడతామని ప్రకటించారు. ఈ ప్రకటనతో వరంగల్ వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే.. వరంగల్ ప్రజలకు మంత్రి కొండా సురేఖ తీపి కబురు అందించారు. వరంగల్ ప్రజల చిరకాలవాంఛ అయిన మామునూరు ఎయిర్ పోర్టు కల సాకారం కానుందని మంత్రి కొండా సురేఖ తెలిపారు. ప్రయాణికుల సర్వీసులతో పాటు కార్గో సర్వీసులు అందించే దిశగా ఎయిర్ పోర్ట్ ను అభివృద్ధి చేసే దిశగా సీఎంతో చర్చిస్తానన్నారు మంత్రి సురేఖ. అత్యుత్తమ నగరంగా వరంగల్‌ను అభివృద్ధి చేస్తామని మంత్రి పునరుద్ఘా టించారు. జిడబ్ల్యుఎంసి మాస్టర్ ఎ÷-లాన్ అమలుకు ప్రత్యేక అధికారి నియమించాలని ఎంఎయుడి ముఖ్య కార్యదర్శికి ఆదేశాలు జారీ చేశారు.

## ప్రైవేటు ఆస్తులపై సుప్రీంకోర్టు చారిత్రాత్మక తీర్పు

**మొదటి పేజీ తరువాయి...**

చేసుకునే హక్కు లేదన్నారు. ఈ మేరకు గతంలో జస్టిస్ కృష్ణయ్యర్ ఇచ్చిన తీర్పును మెజారిటీ తీర్పు తోసిపుచ్చింది. ఆర్టికల్ 39(బీ) ప్రకారం ప్రైవేట్ ఆస్తులను 'సమాజ ముఖ్య వనరులు'గా పరిగణించవచ్చా?, పంపిణీ కోసం ప్రభుత్వాధికారులు స్వాధీనం చేసుకోవచ్చా? అనే న్యాయపరమైన ప్రశ్నలపై సీజే చంద్రచూడ్‌తో పాటు మరో ఏడుగురు న్యాయమూర్తులు అనుకూలంగా తీర్పుఇచ్చారు. ఉమ్మడి ప్రయోజనాల కోసం రాష్ట్రాలు అన్ని ప్రైవేట్ ఆస్తులను స్వాధీనం చేసుకోవచ్చంటూ గతంలో వెలువడిన అన్ని తీర్పులను జడ్జిలు తోసిపుచ్చారు.

**సీజే చంద్రచూడ్ తీర్పులో ఏముందంటే..**

" కేవలం భౌతిక అవసరాలే అర్హతగా.. ఒక వ్యక్తికి చెందిన అన్ని ప్రైవేటు వనరులను కమ్యూనిటీ మెటీరియల్ రిసోర్స్‌గా పరిగణించకూడదని భావిస్తున్నాం. సందేహాస్పద వనరు గురించిన విచారణ రాజ్యాంగంలోని 39బీ నిబంధన కిందకు వస్తుంది. వనరుల స్వభావం, లక్షణాలు, సమాజానికి ఎంతవరకు ఉపయోగకరం, వనరుల కొరత, వనరుల పరిణామాలు వంటి అంశాలు పరిగణనలోకి తీసుకోవాలి. ప్రజా విశ్వాస సిద్ధాంతం సమాజానికి సంబంధించిన వనరుల పరిధిలోకి వచ్చే ఆస్తులను గుర్తించడంలో దోహదపడుతుంది" అని సీజే చంద్రచూడ్ పేర్కొన్నారు.



## 25 నుంచి పార్లమెంట్ సమావేశాలు

**మొదటి పేజీ తరువాయి...**

కానుంది. ప్రస్తుతం మహారాష్ట్ర, ఝార్ఖండ్ అసెంబ్లీ ఎన్నికలపై అన్ని పార్టీలు దృష్టి సారించాయి. నవంబర్ 23న ఫలితాలు వెల్లడికానున్నాయి. ఆ తర్వాతే ఈ సెషన్ ప్రారంభంకానుంది. ఈ సమావేశాల్లోనే కేంద్రం వక్ఫ్ బిల్లును ప్రవేశపెట్టనుందని తెలుస్తోంది. గత సెషన్‌లోనే కేంద్రం ఈ బిల్లును తీసుకువచ్చింది. అయితే విపక్షాలు దీనిపై తీవ్ర నిరసన వ్యక్తంచేయడంతో కేంద్రం ఒక్క అడుగు వెనక్కివేసి..దానిని సంయుక్త పార్లమెంటరీ కమిటీ పరిశీలనకు పంపింది.

## కుటుంబ సర్వే నుంచి టీచర్లను మినహాయించండి

**మొదటి పేజీ తరువాయి...**

చేస్తూ నవంబర్ 1వ తేదీన విద్యాశాఖ విడుదల చేసిన ఉత్తర్వులు నిబంధనలకు విరుద్ధం అన్నారు. ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకే పాఠశాలలు నిర్వహించాలనేది ఈ ఉత్తర్వుల సారాంశంగా కనిపిస్తున్నదని హరీశ్‌రావు పేర్కొన్నారు. మీ పాలన పుణ్యమా అని ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలపై ఉన్న నమ్మకం రోజురోజుకీ దిగజారుతున్నది. మీ నిర్లక్ష్యం, అనాలోచిత నిర్ణయాలు విద్యార్థులు, తల్లిదండ్రులకు తోడు ఉపాధ్యాయులకు శాపాలుగా మారుతున్నాయి. ఇప్పుడు కుటుంబ సర్వే పేరుతో టీచర్లు, విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తూ, విద్యావ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం, ఉపాధ్యాయులను జనాభా గణన లెక్కలు, ప్రకృతి వైపరీత్యాలలో సహాయ విధులు, పార్లమెంటు, రాష్ట్ర శాసన సభ, స్థానిక ప్రభుత్వాలకు జరిగే ఎన్నికలకు సంబందించిన విధులకు మాత్రమే వినియోగించాలని స్పష్టం చేస్తుంది. ఇవి కాకుండా మరేఇతర పనులకు వినియోగించకూడదని విద్యా హక్కు చట్టం నిర్దేశిస్తురది. ఈ నిబంధనలకు విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం కుల గణన కోసం ఉపాధ్యాయులను వినియోగించుకోవడం విద్యా హక్కు చట్ట ఉల్లంఘన కిందికి వస్తుందని హరీశ్‌రావు తెలిపారు. ప్రభుత్వ బడులలో చదివే పిల్లల తల్లిదండ్రులు అత్యధిక శాతం కూలినాలి చేసుకునే వారే. అకస్మాత్తుగా ఒంటి పూట బడులు నడపడం వలన పిల్లలకే కాకుండా తల్లిదండ్రులకు కూడా ఇబ్బందులు ఉంటాయి. పిల్లల చదువులు కుంటుపడటంతో పాటు వారి భవిష్యత్తుపై ప్రభావం పడుతుంది. కాబట్టి, విద్యా హక్కు చట్టాన్ని దృష్టిలో ఉంచుకొని సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నుండి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులను మినహాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామని హరీశ్‌రావు తన లేఖలో పేర్కొన్నారు.

# సీడీసీ ఛైర్మన్, కురుమూర్తి దేవస్థానం డైరెక్టర్‌లను సన్మానించిన కొత్త కోట సాగర యూత్



సి డి ఎస్ ఛైర్మన్ చంద్రశేఖర్ రెడ్డిని సన్మానిస్తున్న సంఘం ప్రతినిధులు



బాదం వెంకటేశ్వర్లు ని సన్మానిస్తున్న సంఘం నాయకులు

కొత్తకోట, నవంబర్ 5(ప్రభాత ఉదయం) కొత్త కోట మున్సిపల్ కేంద్రంలో మంగళవారం సాగర ఉప్పర యువజన సంఘం ఆధ్వర్యంలో చెరుకు అభివృద్ధి సంస్థ (సీడీసీ) ఛైర్మన్ చంద్ర శేఖర్ రెడ్డి (గొల్లబాబు)ని శ్రీ కురుమూర్తి దేవస్థానం పాలక మండలి సభ్యులు బాదం వెంకటేశ్వర్లు, భారతి లక్ష్మి నారాయణ, లను కొత్తకోట సాగర యూత్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించడం జరిగిందని తెలిపారు .ఈ కార్యక్రమం లో జిల్లా కోశాధికారి కురుమూర్తి సాగర్, ఉమ్మడి జిల్లా యూత్ మాజీ అధ్యక్షులు నరేంద్ర సాగర్, పట్టణ అధ్యక్షులు యస్ పి సురేష్ సాగర్, ప్రధాన కార్యదర్శి పి వినోద్ సాగర్, కోశాధికారి సి కురుమూర్తి, కె రమేష్ సాగర్, కె కృష్ణ, పి రాము, పి వినోద్ కుమార్, కేవీకె శ్రీను, కరెంట్ రవి, పి రామాంజనేయులు, చీర్ల రాజు, పి విజయ్ సాగర్, పి రవి సాగర్, ఫోటో స్టూడియో రాజు, జిన్నారం కృష్ణ, చీర్ల రమేష్ (బుక్ సెంటర్) తదితరులు పాల్గొన్నారు.



కురుమూర్తి దేవస్థానం సభ్యులకు భారతి లక్ష్మి నారాయణ ను సన్మానిస్తున్న సంఘం ప్రతినిధులు



## కొత్తకోట మున్సిపాలిటీ వర్కర్స్ యూనియన్ నూతన కమిటీ ఏర్పాటు

కొత్తకోట, నవంబర్ 5(ప్రభాత ఉదయం) కొత్తకోట మున్సిపాలిటీ వర్కర్స్ యూనియన్ సిఐటియు అనుబంధం నూతన కమిటీని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బొబ్బిలి నిక్సన్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఏకగ్రీవ ఎన్నుకోవడం జరిగిందని అన్నారు.అధ్యక్షులు గా కే.కృపయ్య,ఉపాధ్యక్షులుగా జే.శ్రీను, కార్యదర్శిగా వి శ్రీనివాసులు, సహాయ కార్యదర్శిగా ఆర్ రమేష్, కోశాధికారగా ఎండి మగ్బుల్, కమిటీ సభ్యులుగా మద్దిలేటి,కొండన్న, కే మన్నెమ్మ, జే పద్మ,రాజేశ్వరి,సలహాదారులుగా నోవేల్, జాజుల రమేష్,జాన్సన్, ను ఏకగ్రీవంగా ఎన్నోకోడం జరిగిందని సభ్యులు తెలిపారు.ఈ కార్యక్రమంలో కే వెంకటయ్య, ఆనంద్ రాజు, కురుమన్న,శివ, లక్ష్మీ,శిరీష, సరళ,భాగ్యమ్మ, తదితరులు పాల్గొన్నారు.



## మాదిగల ధర్మ యుద్ధ సభకు తరలిరండి

కొత్తకోట, నవంబర్ 5(ప్రభాత ఉదయం) మహబూబ్ నగర్ పట్టణంలో గురువారం జరగనున్న మాదిగల ధర్మ యుద్ధ మహాసభకు మాదిగలు, మాదిగ ఉపకులాలకు చెందిన యువతి, యువకులు, వివిధ రాజకీయ పార్టీలలో ఉన్న మాదిగ సోదరులు, మాదిగ ఉద్యోగులందరూ పెద్ద సంఖ్యలో తరలిరావాలని కొమ్ము చెన్నకేశవులు మాదిగ,జిల్లా దండోరా అధ్యక్షులు, గంధం గట్టన్న మాదిగ రాష్ట్ర నాయకులు పిలుపునిచ్చారు. కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలోని ఎస్సీ కాలనీలో సోమవారం జరిగిన సన్నాహక సమావేశానికి చెన్నకేశవులు, గట్టాన్న లు ముఖ్య అతిథులుగా పాల్గొని ఈ సందర్భంగా వా రు మాట్లాడుతూ ... మాదిగల ధర్మ యుద్ధ మహాసభను విజయవంతం చేసి, మాలలపక్షపాతిగా మారిన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కనువిప్పు కలిగే విధంగా చేయాలని అన్నారు. వర్గీకరణను తక్షణమే అమలు చేస్తానని అసెంబ్లీ సాక్షిగా చెప్పి, మాట మార్చి, వర్గీకరణను అమలు చేయకుండానే, ఉద్యోగాల భర్తీ చేస్తూ మాదిగలకు తీరని ద్రోహం చేస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి తీరును తన సొంత జిల్లాలోనే ఎండగట్టాలని సంకల్పించిన మాన్యశ్రీ మందకృష్ణ మాదిగ,కు మద్దతు తెలుపుతూ, వేలాదిగా మాదిగలు తరలిరావాలని కోరారు.ఈ కార్యక్రమంలో కొమ్ము భరత్ భూషణ్, మిషేక్, కిరణ్,నవీన్ కుమార్, ప్రవీణ్ కుమార్, ప్రియదర్శనం, క్రాంతి కుమార్,నాగరాజు,శాస్త్రి, కండక్టర్ జయపాల్, దివాకర్,సురేష్, జే.రమేష్, సంజీవు, యాకోబు,రాజు, పెయింటర్ కృపయ్య, రాజేష్, మేస్త్రి రాములు,తదితరులు పాల్గొన్నారు.

## షాద్ నగర్ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్‌గా వెంకటేశ్వర్లు నియామకం

శంషాబాద్, నవంబర్ 5( ప్రభాత ఉదయం) సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని శంషాబాద్ జోన్ షాద్ నగర్ డిటెక్టివ్ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ గా సంద వెంకటేశ్వర్లు నియమితులయ్యారు. షాద్ నగర్ పోలీస్ స్టేషన్లో సోమవారం ఆయన పదవీ బాధ్యతలు స్వీకరించారు. శంషాబాద్ ఆర్ జి ఐ ఏ పోలీస్ స్టేషన్ లో ఎస్సైగా పనిచేసిన సమయంలో మంచి పోలీస్ అధికారిగా ఆయన గుర్తింపు పొందారు.





## రాహుల్ గాంధీకి ఘన స్వాగతం పలికిన ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు యుగంధర్ రెడ్డి

కూకట్‌పల్లి, నవంబర్ 5 (ప్రభాత ఉదయం)రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణలో ప్రారంభించనున్న కులగణనపై ప్రజలు, మేధావులు, వివిధ సామాజిక వర్గాల వారి సలహాలు, సూచనలు స్వీకరించడానికి హైదరాబాద్ బోయిన్ పల్లి (గాంధీ ఐడియాలజీ సెంటర్) లో నిర్వహించనున్న కులగణన సంప్రదింపుల సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొంటున్న ఏఐసీసీ అగ్రనేత, లోక్ సభ విపక్ష నేత రాహుల్ గాంధీ కి బోయిన్ పల్లి (చిన్న తోకట) వద్ద కూకట్ పల్లి నియోజకవర్గ ఇంచార్జ్ బండి రమేష్, ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్ రెడ్డి, కూకట్ పల్లి ముఖ్యనాయకులతో ఘన స్వాగతం పలికారు.



## ప్రజలకు సేవ చేయడంలో లయన్స్ క్లబ్ ఎల్లప్పుడూ ముందుండడం అభినందనీయం

### బాలానగర్ లైన్స్ క్లబ్‌లో అదనపు గదులకు భూమి పూజ చేసిన ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా

కూకట్‌పల్లి, నవంబర్ 5 (ప్రభాత ఉదయం) ప్రపంచవ్యాప్తంగా లైన్స్ క్లబ్ సేవలు అవసరమైన ప్రతి సందర్భంలోనూ ప్రజలకు అందుబాటులో ఉంటున్నాయని బహుశా ఇలాంటి సంస్థ ప్రపంచంలోనే మరొకటి లేదని కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. బాలానగర్ డివిజన్ పరిధిలో లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించ తలపెట్టిన హాస్పిటల్ నూతన గదులకు ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బండి రమేష్ మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా ఎక్కడైనా ప్రజలు ఆపద సమయంలో ఉంటే తన ఆపన్న హస్తాన్ని ఇచ్చి లైన్స్ క్లబ్ ఆదుకుంటుందన్నారు. ప్రజలకు సేవ చేయడంలో లయన్స్ క్లబ్ ముందుంటుందన్నారు. జబ్బు వచ్చిన తర్వాత చికిత్స తీసుకునే కంటే ఆ జబ్బు రాకుండా చూసుకోవడం మంచి పరిణామని రమేష్ పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ సేవలు గ్రామాల్లోకి సైతం వెళ్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు గొట్టిముక్కల వెంకటేశ్వరరావు, పులి శివకుమార్ గౌడ్, కొప్పిశెట్టి దినేష్ కుమార్, గంధం రాజు, సంజీవ, బాలానగర్ డివిజన్ ప్రెసిడెంట్ మధు గౌడ్, బాల నరసింహా, అనిల్, నరేందర్ భరత్ తదితరులు పాల్గొన్నారు.



## సీఈఐఆర్ ద్వారా మొబైల్ రికవరీ శాతంలో రాష్ట్రంలో 5వ స్థానంలో జోగులాంబ గద్వాల్ జిల్లా పోలీసులు

### అభినందించిన రాష్ట్ర డిజిపి జితేందర్

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 5(ప్రభాస్ ఉదయం) దొంగిలించన, పోగొట్టుకున్న సెల్ ఫోన్ల రికవరీ లో జోగులాంబ గద్వాల్ జిల్లా పోలీసులు ఉత్తమ ప్రతిభ కనబరిచి తెలంగాణ రాష్ట్ర గౌరవ డీజీపీ డాక్టర్ జితేందర్ చేతుల మీదుగా మంగళవారం ప్రశంసా పత్రం అందుకున్నారు. జిల్లా పరిధిలో ఏప్రిల్-2023 నుండి అక్టోబర్ - 2024 వరకు జిల్లా వ్యాప్తంగా గా 948 సెల్ ఫోన్లను గుర్తించి స్వాధీనం చేసుకొని సెల్ ఫోన్ యజమానులకు అందజేశారు. సెల్ ఫోన్లను గుర్తించి రికవరీ చేయడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు రాష్ట్ర డిజిపి డాక్టర్ జితేందర్ , జిల్లా ఎస్పీ టి . శ్రీనివాస రావు ని ,జిల్లా పోలీసు అధికారులు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించినారు. ఈ ప్రశంసా పత్రాన్ని డిజిపి ఐటీ సెల్ ఇంచార్జి ఎస్సై రజిత కు అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్ పి శ్రీనివాసరావు మాట్లాడుతూ... సెల్ ఫోన్ దొంగతనాల నుండి విముక్తి కల్పించడానికై డిపార్ట్మెంట్ ఆఫ్ టెలీ-కమ్యూనికేషన్ సి.ఇ.ఈ.ఆర్ పోర్టల్ ను అందుబాటులోకి తీసుకురావడం జరిగిందని, ఈ పోర్టల్ ద్వారా మంచి ఫలితాలు రాబట్టడం జరుగుతుందన్నారు. ఎవరైన మొబైల్ పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన వెంటనే సి.ఇ.ఐ. ఆర్ పోర్టల్ నందు బ్లాక్ చేసి, సంబందిత పోలీసు స్టేషన్లో సమాచారం ఇవ్వాలని ఎస్పి ప్రజలకు సూచించారు. సీఈఐఆర్ ద్వారా ఎక్కువ మొత్తంలో మొబైల్ రికవరీ చేసి జిల్లా ను 5వ స్థానంలో నిలిపిన పోలీస్ సిబ్బందిని జిల్లా ఎస్ పి టి శ్రీనివాస రావు అభినందించారు.



విద్యార్థులతోజిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి గంట కవితా దేవి

## బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి

### జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి గంట కవితా దేవి

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 5(ప్రభాత ఉదయం) బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని, పిల్లలు చదువుకొనేలా ప్రోత్సహించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి గంట కవితా దేవి అన్నారు..మంగళవారం గద్వాల మండలంలోని గుంటిపల్లి, రేకులపల్లి గ్రామాల్లో బాల కార్మిక వ్యవస్థను నియంత్రించేందుకు పత్తి, మిరప పొలాల్లో ఆమె ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రతి చిన్నారికి విద్య చాలా అవసరం, చిన్న వయసులోనే పని చేయడం కాకుండా పాఠశాలలో ఉండి భవిష్యత్తును నిర్మించుకోవాలని అన్నారు. పర్యటనలో భాగంగా పంట పొలాల్లో 18 ఏళ్ల లోపు వయసున్న చిన్నారులు పనిచేస్తున్నట్టు గుర్తించారు. వెంటనే వారి వివరాలు సేకరించి, పరిస్థితులను సమీక్షించారు. చిన్నారులు పని చేయడం కాకుండా విద్యను కొనసాగించడం అత్యవసరం అని అన్నారు. చిన్నారులను గుంటిపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో చేర్పించారు. ప్రధానపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, గ్రామ పెద్దలతో కలిసి బాల్య కార్మికత్వం వల్ల విద్యను వదిలివేస్తున్న చిన్నారుల సమస్యలపై చర్చించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను పంట పొలాల్లో, పత్తి లేదా ఇతర కంపెనీలలో పనిచేయడానికి పంపకూడదని అన్నారు. బాల్య కార్మికులను నియమించడం చట్టవిరుద్ధమని, ఇలాంటి సందర్భాలలో చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని అన్నారు. బాల్య కార్మికత్వాన్ని నివారించేందుకు ప్రజల్లో అవగాహన పెంచాలన్నారు. అనంతరం పాఠశాలలో అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యతను కూడా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ సీనియర్ అసిస్టెంట్ అబ్రహం, అడ్వకేట్ రాజేందర్, గద్వాల్ రూరల్ పోలీసులు, తదితరులు కూడా పాల్గొన్నారు.

## అర్హత గల వికలాంగులకు సర్టిఫికెట్ కొత్తవి, రెన్యువల్ కొరకు సదరం క్యాంపులు

గద్వాల జిల్లా ప్రతినిధి, నవంబర్ 5(ప్రభాత ఉదయం) జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో అర్హత గల వికలాంగులకు సర్టిఫికెట్ కొత్తవి , రెన్యువల్ కొరకు సదరం క్యాంపులు నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి నర్సింగరావు ఒక ప్రకటనలో తెలిపారు. సదరం క్యాంప్ ఈ నెల మొత్తం ప్రతి మంగళ, బుధ, శుక్ర వారాలలో నిర్వహిస్తున్నట్లు అర్హత గల వికలాంగులు సర్టిఫికెట్స్ కొత్తవి తీసుకోవడానికి ముందే మీసేవ కేంద్రాలలో సదరం స్లాట్ బుకింగ్ చేసుకోవాలని అన్నారు. స్లాట్ బుకింగ్ చేసుకున్నవారు నిర్ణయించిన తేదీలలో ప్రభుత్వ హాస్పిటల్ నందు హాజరు కావాలని, హాజరైన వారికి అదే రోజు సదరం సర్టిఫికెట్ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. ఈ క్యాంప్ లు ఈనెల 12, 19, 26 తేదీన శారీరక వికలత్వం, కంటి వికలత్వం గల వారికి 13, 20, 27 తేదీలలో శారీరక వికలత్వం గల వారికి 7, 14, 21, 28 తేదీలలో శారీరక మానసిక, చెవిటి, మూగ వికలత్వం వారికి 8, 22, 29 తేదీలలో చెవిటి, మూగ వికలత్వం గలవారికి క్యాంపులు నిర్వహించినట్లు ఆయన తెలిపారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: KOTLA CHANDRA KANTH. "RNI. Title- Code: TELTEL12231**. Cell: 9705231654.